
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శుక్రవారం 3 జనవరి 2025 | 5



సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

రేపు అమలాపురంలో ముత్యాల ముగ్గుల పోటీ

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, సంతూర్ ఆధ్వర్యంలో నిర్వహణ

అమలాపురం టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, సంతూర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ శనివారం అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ముత్యాల ముగ్గుల పోటీ నిర్వహించనున్నారు. ఈ ముత్యాల ముగ్గుల పోటీలో పాల్గొనే మహిళల్లో విజేతలైన వారికి ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలతో పాటు కన్సోలేషన్ బహుమతులు కూడా అందజేయనున్నారు. ముత్యాల ముగ్గుల పోటీకి అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు స్పాన్సర్‌గా వ్యవహరించనున్నారు. ఆ రోజు జరిగే ముగ్గుల పోటీకి నేరుగా మహిళలు హాజరు కావచ్చు. ఎవరి ముగ్గులు వారే తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గుకు మాత్రమే ప్రాధాన్యం ఉంటుంది. ప్రతీ ఏటా మాదిరిగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి నిర్వహించే ఈ ముత్యాల ముగ్గుల పోటీలో మహిళలు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఒకపక్క సంక్షేమం.. మరో పక్క అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం గురువారం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చుతూ కేబినెట్‌లో అన్నదాత సుఖీభవ, మత్స్యకారులకు వేట నిషేధం పరిహారం పెంపు ఆదేశాలు జారీ చేసింది.గత వైసీపీ ప్రభుత్వం అరకొరగా ఇచ్చిన ఆర్థిక లబ్ధిని దాదాపు రెట్టింపుచేస్తూ నిర్ణయాలు తీసుకుంది.తద్వారా అన్నదాతలు, మత్స్యకారుల్లో ఆనందం నింపింది. అదే సమయంలో ఐదేళ్ల పాటు పెట్టుబడుల ఊసే లేకుండా అభివృద్ధిలో వెనుకబడిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను పారిశ్రామికంగా పరుగులు తీసేలా కీలక ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపింది. గ్రీన్‌అమ్మోనియా, ఎలక్ట్రొలైజర్ ఉత్పత్తి యూనిట్ల ద్వారా ఏర్పాటు చేయనున్న కంపెనీలు పలు దశల్లో పెట్టనున్న రూ.16 వేల కోట్ల పెట్టుబడులకు ప్రోత్సాహకాలు ప్రకటించింది. పిఠాపురం ఏరియా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి 19 పోస్టులు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది.



అన్నదాతా సుఖీభవ..

అన్నదాతలకు కేంద్రసాయంతో కలిపి అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇస్తున్నట్టు ప్రకటించింది. సూపర్‌సిక్స్ హామీ నేపథ్యంలో ఇచ్చిన మాట నెరవేరుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 4.54 లక్షల మంది అన్నదాతలకు రూ.908 కోట్ల వరకు లబ్ధి చేకూరనుంది. ప్రధానంగా కాకినాడ జిల్లాలో 1.86 లక్షల మంది రైతులకు రూ.370 కోట్లు దక్కనుంది. తూర్పుగోదావరి జిల్లాలో 1.21 లక్షలు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1.65 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వంలో అన్నదాతలకు ఎకరాకు కేవలం రూ.13,500 వేలు మాత్రమే అందేది. మరో పక్క పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి 19 కొత్త పోస్టులను మంజూరు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

ఆనందం రెట్టింపు...

సుదీర్ఘ సముద్రతీరం ఉన్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వేలల్లో మత్స్యకారులు ఉన్నారు. వీరందరికి సముద్రంలో చేపలవేటే జీవనాధారం. ఏటా ఏప్రిల్ నుంచి జూన్ మధ్య దాదాపు 61 రోజుల పాటు వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అసలు ఉపాధి ఉండదు. దీంతో ప్రభుత్వాలు వేట నిషేధ సమయంలో ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయి. గత వైసీపీ హయాంలో మత్స్యకార భరోసా కింద వేట నిషేధ పరిహారం మత్స్యకారులకు రూ.10 వేలు చెల్లించేది. కూటమి ప్రభుత్వం రాగానే మత్స్యకారులకు అందించే పరిహారం పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వేట నిషేధ పరిహారాన్ని ఏకంగా రూ.20 వేలు చేస్తున్నట్టు ప్రకటించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన పరిహారాన్ని రెట్టింపు చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 32,434 మంది మత్స్యకారులకు రూ.64.86 కోట్ల లబ్ధి జరగనుంది. కాకినాడ జిల్లాలో 21,129 మంది, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 11,305 మంది మత్స్యకారులకు పరిహారం అందనుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లోకి నిధులు జమకానున్నాయి. దీంతో మత్స్యకారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

కూటమి వరాల హారం.. ఆనంద తీరం

- రాష్ట్ర కేబినెట్‌లో కీలక నిర్ణయాలు
- మత్స్యకారుల పరిహారం రెట్టింపు
- రూ.20 వేలకు పెంచుతూ నిర్ణయం
- 32,434 మందికి లబ్ధి
- అన్నదాత సుఖీభవ రూ.20 వేలు
- జిల్లాలో 4.54 లక్షల మంది రైతులు
- కాకినాడకు రెండు పరిశ్రమలు
- రూ.16 వేల కోట్ల పెట్టుబడులు

అమ్మోనియా హబ్‌గా కాకినాడ..

వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకినాడకు ఒక్కటంటే ఒక్క పరిశ్రమా రాలేదు. పైగా ఉన్న పరిశ్రమలను బెదిరించి ఏకంగా రాయించేసుకున్నారు. దీనికి కాకినాడ సీపోర్ట్‌లో వాటాల మార్పే నిదర్శనం. అయితే వైసీపీ మిగిల్చిన విధ్వంసం నుంచి బయటపడి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా పరిశ్రమలను ఆహ్వానిస్తూ కంపెనీలకు పెద్దపీట వేస్తోంది. కాకినాడలో ఏర్పాటవుతున్న గ్రీన్ అమ్మోనియా, ఎలక్ట్రొలైజర్ కంపెనీలకు భారీగా అండగా నిలబడి ప్రోత్సాహకాలు ప్రకటించింది. హైదరాబాద్‌కు చెందిన గ్రీన్‌కో కంపెనీ కాకినాడలో రూ.13 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. కంపెనీని పోత్సహించి భారీగా ఉద్యోగ, ఉపాధి కల్పన జరిగేలా కోట్లలో స్టాంప్ డ్యూటీ మినహాయింపునిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఒకరకంగా ఈ కంపెనీ కార్యకలాపాలు ప్రారంభిస్తే కాకినాడ రూపురేఖలు మారడంతోపాటు రాష్ట్ర ఖజానాకు భారీగా పన్నుల ఆదాయం సమకూరనుంది. చలమలశెట్టి సునీల్ సోదరుడికి చెందిన గ్రీన్ కో కంపెనీ ఏఎం గ్రీన్‌గా ఏర్పడి 2023లో కాకినాడలో పేరొందిన నాగార్జున ఫెర్టిలైజర్ కర్మాగారాన్ని రూ.1,700 కోట్లకు స్టాక్ ఎక్సేంజీ ద్వారా కొనుగోలు చేసింది. ఇప్పుడు దీనినే సాంకేతికంగా అభివృద్ధి చేసి గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయబోతోంది. 2026 జూన్‌లోపు ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసి ఒక మిలియన్ టన్ను సామర్థ్యంతో కూడిన గ్రీన్ అమ్మోనియాను కంపెనీ ఉత్పత్తి చేయనుందని అంచనా వేస్తున్నారు.

నీటి నుంచి ఆ రెండూ..

కాకినాడలో రూ.2,800 కోట్లతో ఎలక్ట్రొలైజర్ల తయారీ ప్లాంట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. హైడ్రోజన్ ఇంధనం తయారీలో కాకినాడ దేశంలోనే కీలకంగా మారనుంది. ఈ ప్లాంట్‌ను సైతం గ్రీన్‌కో కంపెనీ ఏర్పాటు చేయబోతోంది. ఈ ప్లాంట్ ద్వారా ఏటా 2 గిగా వాట్ల ఉత్పత్తి చేయనున్నారు. ఈ కంపెనీ నీటిలో ఎలక్ట్రొలైజర్ యంత్రాలను ప్రవేశపెట్టి నీటి నుంచి హైడ్రోజన్, ఆక్సిజన్‌ను వేరుచేస్తుంది. ఇందులో హైడ్రోజన్‌ను కాకినాడలో ఏర్పాటుచేయనున్న గ్రీన్ అమ్మోనియం ప్లాంట్‌కు ఇంధనంగా వినియోగించనుంది. హైడ్రోజన్‌లో నైట్రోజన్‌ను కలిపి గ్రీన్ అమ్మోనియం తయారుచేయనుంది. నీటి నుంచి వేరుచేసిన ఆక్సిజన్‌ను సైతం విక్రయించనుంది.



7 నుంచి కోనసీమ క్రీడోత్సవం

అమలాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7 నుంచి కోనసీమ క్రీడోత్సవం పేరిట నిర్వహిస్తున్న క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మండల, జిల్లా స్థాయిల్లో క్రీడోత్సవం నిర్వహించాలన్నారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలను ప్రాథమిక స్థాయిలో అథ్లెటిక్స్ ఈవెంట్స్‌తో నిర్వహించి విజేతలైన క్రీడాకారులకు బహుమతులు అందజేయాలన్నారు. అదే విధంగా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల స్థాయిలో అథ్లెటిక్స్ పోటీలతో పాటు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బాస్కెట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు, బాలికల కోసం బ్యాడ్మింటన్ పోటీలు మండల స్థాయిలో నిర్వహించాలన్నారు. మండల స్థాయి విజేతలకు ఈ నెల 22, 23 తేదీల్లో అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందించాలన్నారు. జిల్లాస్థాయి క్రీడా పోటీల అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులతో క్రీడా పోటీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న ఐదు ఆట స్థలాల అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ డీఈ పీఎస్ రాజ్‌కుమార్‌ను ఆదేశించారు. మండలస్థాయి క్రీడా పోటీలకు మండల విద్యాశాఖాధికారి, ఎంపీడీవో, వ్యాయామ ఉపాధ్యాయులతో ఆర్గనైజింగ్ కమిటీ నియమిస్తామని చెప్పారు. మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు ఈవెంట్ నిర్వహణలో కీలక భూమిక పోషించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 22 ఆటస్థలాల వద్ద ప్రాథమిక వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా మైదానాలను సిద్ధం చేయడంతో పాటు క్రీడా ఎక్విప్‌మెంట్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పాఠశాలల యాజమాన్యాల సహకారంతో జిల్లా విద్యాశాఖ క్రీడాకారులకు భోజన సదుపాయం కల్పించాలన్నారు. జిల్లా ప్రాధికార సంస్థ అధికారి, కలెక్టరేట్ పరిపాలనాధికారి సమన్వయంతో క్రీడాకారులకు టెంట్‌లు, కుర్చీలు, తాగునీరు, వసతులు తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. మొత్తం ప్రక్రియను జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్, కలెక్టరేట్ ఏవో కడలి కాశీవిశ్వేశ్వరరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు గణేష్, తోట రవి, రమణారావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'అంతర్వేది' కల్యాణోత్సవాలపై సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చెప్పారు. అంతర్వేదిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రాంగణంలోని కల్యాణ షెడ్డులో ఉత్సవాల సమీక్షా సమావేశాన్ని అమలాపురం ఆర్డీవో కె.మాధవి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారుల కోఆర్డినేషన్ మీటింగ్‌లో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడారు. స్వామివారి ఉత్సవాలకు సుమారు 4 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతీ ఒక్కరూ కల్యాణ మహోత్సవాలు తిలకించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రధానంగా శానిటేషన్, తాగునీరు, రోడ్ల మరమ్మతులు, రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్, మెడికల్ క్యాంపులు, ట్రాఫిక్, తీర్థ మహోత్సవంలో ముఖ్య ఘట్టాలకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ ఉత్సవాలు నిర్వహించాలన్నారు. స్వామివారి ఉత్సవాల నిర్వహణకు ఉత్సవ సేవా కమిటీ చైర్మన్‌గా దిరిశాల బాలాజీని ప్రతిపాదించామని, వారు భక్తులకు అసౌకర్యం కలుగకుండా వారి బృందంతో సేవలు అందించాలన్నారు. ఆర్డీవో కె.మాధవి విద్యుత్, వైద్యం, తాగునీరు, శానిటేషన్, పోలీసు బందోబస్తు, క్యూలైన్, పార్కింగ్, సీసీ కెమెరాలు, గజ ఈతగాళ్లు, పరిశుభ్రత మొదలగు విషయాలపై చర్చించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతిగదులు, టాయిలెట్స్, సముద్ర స్నానాల వద్ద దుస్తులు మార్చుకునే గదులను ఏర్పాటు చేయాలన్నారు. తెప్పోత్సవం నిర్వహించే మంచినీటి చెరువు మరమ్మతుల్లో ఉండడం వల్ల తెప్పోత్సవాన్ని తూర్పుభాగంలో కొత్తగా కోనేరు తవ్వి నిర్వహించాలా, ప్రత్యామ్నాయం చూడాలా అన్నది తదుపరి సమావేశంలో నిర్ణయిస్తామని ఆర్డీవో మాధవి తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఉత్సవ అధికారి డీఎల్వీ రమేష్‌బాబు, కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు, ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కలిదిండి కుమారరామగోపాల రాజ బహదూర్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ గుండుబోగుల నరసింహారావు (పెద్దకాపు), గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు నీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పినిశెట్టి వెంకటస్వామి (బుజ్జి), ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీలు బైరా నాగరాజు, చొప్పల బాబూరావు, సర్పంచ్ పోతురాజు నరసింహారావు(కిశోర్), తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ ఎ ఫ్‌ఎసీ కె.సూర్యనారాయణ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్షన్ల తనిఖీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా దివ్యాంగ పెన్షన్ల తనిఖీ ప్రక్రియ మార్గదర్శకాలను అనుసరించి నూరుశాతం కచ్చితత్వంతో నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, పేదరిక నిర్మూలనా సంస్థ సీఈవో జి.వీరపాండ్యన్ గురువారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి దివ్యాంగ పెన్షన్ల తనిఖీ ప్రక్రియ విధి విధానాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్లలో అనర్హులు పెన్షన్లు పొందకుండా అర్హులకు మాత్రమే చేరేలా తనిఖీ ప్రక్రియ చేపట్టిందన్నారు. ముందుగా ఇంటింటికీ తనిఖీ నిర్వహిస్తారని, రెండో విడతలో ఆసుపత్రుల తనిఖీ నిర్వహిస్తారన్నారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి సమన్వయ కమిటీ మార్గదర్శకాలకు డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్‌ను కన్వీనర్‌గా నియమించాలన్నారు. చెవిటి, మూగ, మానసిక, కంటిచూపు దివ్యాంగత్వం కలిగిన వారిని బృందాలు ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో వైద్య బృందాన్ని కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్, ఇతర వైద్య నిపుణుల సహకారంతో బృందాలను నియమిస్తారన్నారు. డీఆర్డీఏ పీడీ ముందుగా కార్యాచరణకు రూట్‌మ్యాప్‌లు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీక్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి, జీఎస్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ సువిజయ్ పాల్గొన్నారు.

6లో రేపు 'గేమ్ ఛేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాక

ఆంధ్రజ్యోతి/సర్పవరం జంక్షన్

ఆ ఇల్లు..హరిత నందనవనం

మిద్దె తోటల సాగులో ఆదర్శం

ఆరేళ్లుగా ఆర్గానిక్ విధానంలో ఫలసాయం

650కి పైగా పూలు, పండ్ల మొక్కల పెంపకం

ఏరువాక, రైతునేస్తం అవార్డులు సాధించిన

కాకినాడకు చెందిన రాధ








ఆమె ఇల్లు ఓ హరిత నందనవనం. ఆ ఇంటికి వెళ్లగానే ఏజెన్సీ ప్రాంతానికి వెళ్తున్నామా అన్న అనుభూతి కలుగుతుంది. ఇల్లంతా గుబురుగా ఉండే పలు రకాల పచ్చని పండ్ల మొక్కలు, పువ్వులతో పరిమళాన్ని వెదజల్లుతూ ఎంతో ఆహ్లాదమైన వాతావరణం స్వాగతం పలుకుతుంది. మొక్కల పెంపకంపై ఉన్న ఆసక్తి మిద్దె తోటల సాగువైపు వెళ్లేలా కంకనాలపల్లి రాధను ప్రేరేపించింది. ఆరేళ్లుగా సంప్రదాయ సిద్ధంగా సేంద్రియ విధానంలో మిద్దె తోటల సాగు చేస్తూ ప్రతిష్టాత్మకమైన ఏరువాక, రైతు నేస్తం అవార్డులు సాధించి ఇతరులకు మార్గదర్శకంగా నిలిచారు.

మిద్దె తోటలకు కేరాఫ్‌గా..



కాకినాడ రెండో డివిజన్ దుర్గా విద్యుత్‌నగర్‌కు చెందిన కంకనాలపల్లి మురళీగోపాలకృష్ణ, రాధలు భార్యాభర్తలు. భర్త ఇరిగేషన్‌శాఖలో ఈఈగా పనిచేసి 18ఏళ్ల కిందట పదవీ విరమణ చేశారు. వీరి తల్లిదండ్రులది వ్యవసాయ కుటుంబం కావడంతో చిన్ననాటి నుంచి మొక్కల పెంపకాన్ని అలవాటుగా చేసుకున్నారు. ఇప్పుడు నేడు మొక్కలు లేనిదే జీవితం లేనంతగా వాటిపై ప్రేమను పెంచుకున్నారు. రెండు దశాబ్ధాలుగా కాకినాడలో సొంతింట్లో జీ ప్లస్ టూ భవన సముదాయాన్నే మిద్దె తోటల పెంపకం కేంద్రంగా చేసుకుని గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌లపై 650కిపైగా పలు రకాల మొక్కలు, పండ్ల మొక్కలు, కాయగూరలు, ఆకుకూరలు, పూల మొక్కలను పెంచుతున్నారు. వీటిని కడియం, బెంగళూరు, హైదరాబాద్‌తోపాటు నర్సరీలు, ఆన్‌లైన్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు.

సేంద్రియ సాగుతో మేలు

సేంద్రియ విధానంలో మిద్దె తోటల సాగుతో కుటుంబ సభ్యులంతా ఆరోగ్యంగా జీవించవచ్చు. ఖాళీ స్థలం అవసరం లేదు. ఇంటి ఆవరణ, పై అంతస్తులో ఉన్న కొద్దిపాటి స్థలంలో వివిధ రకాలైన ఫల, పుష్పాలు, ఆకు, కాయగూరల సాగు చేపట్టవచ్చు. 50 ఏళ్లుగా భర్త సహకారంతో మొక్కలు పెంచడాన్ని అలవాటుగా చేసుకున్నా. ఇంట్లో సాగు చేసిన ఫలసాయాన్నే ఆహారంగా తీసుకుంటున్నాం.

-కంకనాలపల్లి రాధ, కాకినాడ



అవార్డులు..

మిద్దె తోటల పెంపకంపై ఆరేళ్లుగా రాధ సేంద్రీయ విధానంలో అనుసరిస్తున్న ఉత్తమ ఆచరణీయ పద్ధతులు, ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. మిద్దె తోటల పెంపకంపై ఇతరులకు అవగాహన కల్పిస్తూ, చైతన్యం తీసుకొస్తున్నందుకుగాను 2023 ఏడాదికిగాను ఉత్తమ ప్రోత్సాహిక మిద్దె తోటల నిర్వాహకురాలిగా తెలంగాణా, ఏపీల నుంచి ఈమెకు విజయవాడ, హైదరాబాద్‌కు చెందిన ఏరువాక ఫౌండేషన్, రైతు నేస్తం అవార్డులు ప్రదానం చేశారు.

సేంద్రియ విధానంలో సాగు..

సంప్రదాయ పద్ధతిలో కేవలం ఇంట్లో వినియోగించే సహజసిద్ధమైన వనరులు, వ్యర్థాలను ఉపయోగించి సహజ ఎరువును కంకనాలపల్లి రాధ తయారు చేసుకుంటున్నారు. బయోచారు, వర్మీ కంపోస్టు, డీకంపోస్టు తదితర వాటిని ఇంటి పెరట్లోనే సేంద్రియ ఎరువు(మెన్యూర్) తయారు చేస్తున్నారు. సొంతంగా సేంద్రియ పద్ధతుల్లో తయారు చేసిన ఎరువునే మిద్దెతోటల్లో పెంపకంలో సాగుచేస్తున్నారు. పూల మొక్కల్లో గులాబీ, చామంతి, మల్లెపూలు, మందారం, సంపంగి, నందివర్ధనం తదితర రకాలు ఉన్నాయి. పండ్ల జాతుల్లో బత్తాయి, నారింజ, జామ, ద్రాక్ష, మల్బరీ, మామిడి కాయతోపాటు అరుదుగా లభిస్తున్న డ్రాగన్ ఫ్రూట్, స్వీట్, కివీ కాయ, ఖర్భూజ తదితరాలు ఉన్నాయి. ఆకుకూరల్లో తోటకూర, మెంతు కూర, పొన్నగంటి, పుదీన, కొత్తిమీర, చుక్కకూర, కాయకూరల్లో వంకాయ, బెండ, చిక్కుడుకాయ, మునగ, ఆనబకాయ, పసుపు, టమాటా, అల్లం తదితర కాయకూరలు సాగు చేస్తున్నారు. ఆకర్షణీయంగా కనిపించే స్నేక్ ప్లాంట్, పీస్ లిల్లీ, జడ్ ప్లాంట్లు, మనీ ప్లాంటు, బోన్సాయ్ వంటివి కూడా పెంచుతున్నారు. మొక్కలు పెంచే కుండలకు వివిధ రకాల రంగులు వేసి పూల మొక్కల సాగు చేపట్టడంతో ఆకర్షణీయంగా మారింది.



వీసీ మురళీకృష్ణ నుంచి పుస్తకాలు అందుకుంటున్న విద్యార్థిని

ఫ్రాన్స్‌లోని ఓపెన్ లైబ్రరీ స్ఫూర్తిగా....

ఫ్రీబుల్ ద బుక్ బఫే

జేఎన్టీయూకేలో ప్రారంభించిన ఇన్‌చార్జి ఉప కులపతి మురళీకృష్ణ

జేఎన్టీయూకే, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఫ్రాన్స్‌లోని ఓపెన్ లైబ్రరీని స్ఫూర్తిగా తీసుకుని జేఎన్టీయూకేలో ఫ్రీబుల్ ద బుక్ బఫే కార్యక్రమం చేపట్టామని ఇన్‌చార్జి ఉప కులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. వర్సిటీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన 'ఫ్రీబుల్ ద బుక్ బఫే'ను వీసీ ముఖ్య అతిథిగా పాల్గొని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ఫేస్‌బుక్‌కి అలవాటుపడిన విద్యార్థులు పుస్తక పఠనాన్ని విస్మరిస్తున్నారన్నారు. దానిపై ఆసక్తి కలిగించేలా ఈ ఫ్రీబుక్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు వివరించారు. క్యాంపస్‌లో మూడుచోట్ల దీనిని చేపడతామన్నారు. ప్రజలు, నగర ప్రముఖులు, అధ్యాపకులు అందజేసిన సాధారణ, సాంకేతిక పుస్తకాలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ రీడింగ్ రూమ్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. పుస్తకాలు లేని భవన సముదాయానికి చక్రవర్తిగా ఉండేకన్నా పుస్తకాలు ఉన్న పూరిగుడిసెకు కాపలాదారుగా ఉండడమే సంతోషమన్నదే తెలుగువాడి డీఎన్ఏ అని వీసీ పేర్కొన్నారు. ప్రతి రోజూ గ్రంథాలయంలో చదువుకోవచ్చన్నారు. ప్రతి శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తమకు నచ్చిన రెండు పుస్తకాలను విద్యార్థులు ఉచితంగా తీసుకుని మిగిలిన రోజుల్లో చదువుకునేందుకు తీసుకెళ్లవచ్చన్నారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, పలువురు డైరెక్టర్లు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



సామర్లకోట గూడ్స్‌యార్డ్‌లో దిగుమతి అవుతున్న బిహార్ ధాన్యం

సామర్లకోటకు బిహార్ ధాన్యం

2,400 మెట్రిక్ టన్నులు దిగుమతి

సామర్లకోట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డుకు బీహార్ నుంచి రెండు గూడ్స్ రైళ్ల ద్వారా 2,400 మెట్రిక్ టన్నుల ధాన్యం గురువారం దిగుమతి అయ్యింది. ఇందుకు సామర్లకోట ఏడీబీ రోడ్డులోని ఒక భారీ రైస్‌మిల్లు రైల్వే శాఖకు రవాణా చార్జీగా రూ.90 లక్షలు చెల్లించింది. ఈ ఏడాది సామర్లకోట గూడ్స్ యార్డుకు బీహార్ నుంచి ధాన్యం దిగుమతి ఆవ్వడం ఇదే మొదటిసారి అని రైల్వే గూడ్స్ యార్డు అధికారులు తెలిపారు. తద్వారా సామర్లకోటకు చెందిన సుమారు 300 మంది హమాలీ జట్టు కూలీలకు, 200 లారీలకు ఉపాధి లభించింది.

రేపు 'గేమ్ ఛేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్

ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాక

రామ్‌చరణ్, సినిమా టీమ్ హాజరు

లక్ష మంది వస్తారని అంచనా

వేమగిరి సమీపంలో భారీ ఏర్పాట్లు

రాజమహేంద్రవరం/కడియం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం వేమగిరి సమీపంలోని జాతీయ రహదారి (గతంలో తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహించిన) స్థలంలో ప్రముఖ నటుడు రామ్‌చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను శనివారం నిర్వహించనున్నారు. ఇందుకు గాను భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు లక్ష మంది అభిమానులు హాజరుకావొచ్చని చిరంజీవి అభిమాన సంఘం నాయకుల కథనం. శనివారం సాయంత్రం ఆరు నుంచి 9.30 గంటల వరకు ఈవెంట్ నిర్వహిస్తారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హాజరు కానున్నారు. ఆ రోజు సాయంత్రం మధురపూడి విమానాశ్రయానికి వచ్చి అక్కడి నుంచి కారులో షెల్టన్ హోటల్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ఈవెంట్ స్థలానికి వెళ్తారు. ఈ మేరకు తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ పోలీసు అధికారులతో కలిసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యే సభాస్థలిని పరిశీలించారు.




ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగే గ్రౌండ్ (పైన), ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్ (కింద)

ట్రాఫిక్ మళ్లింపు, భద్రత తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమానికి రామ్‌చరణ్‌తో పాటు నటులు కైరా అద్వానీ, అంజలి, ఎస్‌జే సూర్య, దర్శకుడు శంకర్, దిల్ రాజు, సంగీత దర్శకుడు తమన్ హాజరు కానున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన చిరంజీవి అభిమాన సంఘ నేతలు తాడితోటలో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. ఏఏ ప్రాంతాల నుంచి ఎంత మంది వస్తారో ఓ అంచనా వేశారు. ఈవెంట్‌ను సక్సెస్ చేయాలని అఖిల భారత చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడు రవణం స్వామినాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడిద బాబి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు గెడ్డం శివ, రామ్‌చరణ్ అభిమాన యువశక్తి నేత శివ చెర్రీ, మెగా అభిమానుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలకు నలుగురి ఎంపిక

23న దుప్పలపూడిలో ప్రదానం

అనపర్తి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలోని శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఏటా పలువురు ప్రముఖులకు అందజేసే స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలు -2025కు పలు రంగాల్లో నిష్ణాతులైన నలుగురిని ఎంపిక చేసినట్టు రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం.దుర్గాప్రసాద్ గురువారం విలేకరులకు వెల్లడించారు. జీవన సాఫల్య పురస్కారాలను శాసనసభ పూర్వ ఉప సభాపతి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, చిలుకూరి బాలాజీ దేవస్థానం ప్రధానార్చకుడు సీఎస్ రంగరాజన్, రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారు, బ్యారేజీల నిపుణుడు నాగినేని కన్నయ్యనాయుడులకు. స్వామి వివేకానంద ఎక్స్‌లెన్స్ అవార్డును ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, గౌడీయ సంప్రదాయకుడు రాధా మనోహరదాస్ ప్రభూజీలకు అందించనున్నట్టు వెల్లడించారు. ఈ నెల 23న అనపర్తి సమీపంలోని దుప్పలపూడి ఆర్‌వీఆర్ కన్వెన్షన్ హాలులో జరిగే కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ అవార్డుతో పాటు జ్ఞాపిక, రూ.25వేల నగదు అందిస్తారని దుర్గాప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ పాల్గొంటారన్నారు.

యానాంలో 6 నుంచి ప్రజా ఉత్సవాలు

యానాం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో ప్రజా ఉత్సవాలు, ఫల, పుష్ప ప్రదర్శనల నిర్వహణపై పరిపాలనాధికారి మునిస్వామి గురువారం అధికారులతో సమీక్షించారు. ముఖ్య అతిథిగా హాజరైన పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పుదుచ్చేరి ముఖ్యమంత్రి, గవర్నర్, మంత్రులు, ఇతర ఉన్నతాధికారుల పర్యటనలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అక్కడి నుంచే సీఎం, ఇతర మంత్రులు, అధికారులతో మాట్లాడి వారి పర్యటనలను ఖరారు చేశారు. 6వ తేదీన ఉత్సవాలు ప్రారంభించనున్న సీఎం రంగసామి పలు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టనున్నారు. 8న ముగింపు ఉత్సవాలకు విచ్చేసే గవర్నర్ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ అంశాలపై చర్చించారు. ప్రజా పనులు, మత్స్య, సాంఘిక, పౌరసరఫరాలు, పశువైద్య, వ్యవసాయ, మున్సిపాలిటీ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజా ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న మల్లాడి కృష్ణారావు, అధికారులు

యానాం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు, మహిళలకు గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. 23వ ఫల, పుష్ప ప్రదర్శన సందర్భంగా శ్రీటంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పోటీలు నిర్వహించారు. సందేశాత్మకమైన ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివసుబ్రమణియన్ ముగ్గులను పరిశీలించారు. ఉత్తమ ముగ్గులకు యానాం ప్రజా ఉత్సవాలు, ఫల, పుష్ప ప్రదర్శన సభలో బహుమతులు అందజేయనున్నారు.




ముగ్గును పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివసుబ్రమణియన్, పోటీలో ఆకట్టుకున్న ముగ్గు

భగీరథ యత్నం..!

● సాగు నీటి కోసం గోదావరి ఇసుక తిన్నెల్లో ఊట బావులు

● పది నుంచి 15 అడుగుల లోతు వరకు తవ్వకాలు

● మిర్చి పంటకు తడుల కోసం రైతుల తంటాలు



ఊట బావిలో ఇసుకను తోడుతున్న దృశ్యం



ఇసుక తిన్నెల్లో ఏర్పాటుచేసిన విద్యుత్ మోటార్లు, ఊట బావి నీటిని పంట తడులకు వినియోగిస్తున్న దృశ్యం

ఎటపాక, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో మిర్చి పంట సాగుచేసిన రైతులు నీటి తడుల కోసం భగీరథ యత్నాలు చేస్తున్నారు. పంటకు సాగునీటికి ప్రతి నీటిబొట్టును ఒడిసి పడుతున్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో సాగు చేపట్టిన పంటకు సాగునీటికి రైతులు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రాంత రైతులు మిర్చి పంటను కాపాడుకు నేందుకు అదనపు ఖర్చుల భారంతో పడరాని పాట్లు పడుతున్నారు. గోదావరినది చెంతనే ఉన్నా రైతులకు సాగునీటి కష్టాల సమస్య తొల గడం లేదు. విలీన మండలాల్లో ప్రధానంగా గోదావరి నదీ పరివాహక ప్రాంతాలతోపాటు లంక ప్రాంతాల్లో మిర్చిపంటను సాగుచేసిన రైతులు ఏటా సాగునీటికి ఇసుక తిన్నెల్లోని ఊట బావులపై ఆధారపడుతుంటారు. ఎటపాక మండలంలో ఈ ఏడాది 1,900 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. గోదావరి వరదల భయంతో ఈ ఏడాది రైతులు అక్టోబరు నెల చివరి వరకు పంటను సాగు చేశారు. మొన్నటివరకు గోదావరి నదీ పాయలో నీరు ఉండేది. పాయలో నీరు ఇంకిపోవడంతో రైతులు ఊట బావిల వైపు చూస్తున్నారు. ఈక్రమంలో ప్రధానంగా గన్నవరం, గౌరిదేవిపేట, నందిగామ, మురుమూరు గోదావరి పరివాహక ప్రాంత రైతులు ఊట బావిలను తవ్వుతున్నారు. గతంలో తవ్విన గుర్తులున్న (వరలు)ల్లోని ఇసుకను తొలగిస్తూ ఊట బావిలుగా ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రస్తుతం పది నుంచి 15 అడుగుల వరకు ఊట బావులను తవ్వుతున్నారు. బావిలో ఊరే ఊట నీటిని తడులకు వినియోగిస్తున్నారు. ఊట తగ్గితే నీటి కోసం మరింత లోతు తీస్తున్నారు. తమకు అదనపు ఖర్చులు అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటి నుంచి ఫిబ్రవరి చివరి వరకు మిర్చిపంట సాగునీటికి గోదావరిలో ఇసుకతిన్నె ఊట బావిలపైనే ఆధారపడుతుంటారు.

ఒక్కో ప్రాంతానికి.. ఒక్కో మెనూ



కొత్త మెనూ ఇలా..

సోమవారం: అన్నం, ఆకుకూరతో పప్పు, గుడ్డు ఫ్రై, చిక్కీ

మంగళవారం: పులిహోర, చట్నీ, ఉడికించిన గుడ్డు, రాగిజావ

బుధవారం: అన్నం, కూరగాయల కూర, గుడ్డు ఫ్రై, చిక్కీ

గురువారం: వెజ్‌రైస్/పలావ్, బంగాళ దుంప కుర్మా, ఉడికించిన గుడ్లు, రాగిజావ

శుక్రవారం: అన్నం, ఆకుకూరతో పప్పు, గుడ్డు ఫ్రై, చిక్కీ

శనివారం: అన్నం, కూరగాయల కూర, స్వీట్ పొంగల్, రాగిజావ

▸ సరికొత్తగా మధ్యాహ్న భోజన పథకం

▸ స్థానిక రుచులకు ప్రాధాన్యమిచ్చేలా మెనూ

▸ సంక్రాంతి తర్వాత అమలుకు చర్యలు

పెద్దాపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూలో ప్రభుత్వం మార్పులు చేయనుంది. ఈ మార్పులను జోన్లవారీగా నిర్ధారించనున్నట్లు తెలుస్తోంది. ప్రాంతాల వారీగా విద్యార్థుల ఆహారపు అలవాట్లు ఆసక్తిగా తినే ఆహారం ఆధారంగా ఈ మెనూను రూపొందించింది. విద్యార్థులకు మంచి పోషకాలు అందేలా ఈ మెనూను రూపొందించారు. సంక్రాంతి సెలవుల తర్వాత పాఠశాలల్లో దీన్ని అమలులోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది. వారంలో మంగళవారం మాత్రం రెండు రకాల మెనూలు ఇచ్చారు. విద్యార్థుల ఆసక్తి మేరకు ఏదో ఒకదాన్ని చేస్తారు.

ఒకటే మెనూ కావడంతో..

వైసీపీ హయాంలో మధ్యాహ్న భోజనం తినేందుకు విద్యార్థులు ఆసక్తిని చూపలేదు. ప్రస్తుతం అమలుచేస్తున్న మెనూ రాష్ట్వ్యాప్తంగా ఒకటే కావడంతో కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులు అంత ఇష్టంగా భోజనం చేయడం లేదు. దీన్ని గమనించిన కూటమి ప్రభుత్వం మార్పులు చేయాలని నిర్ణయించింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు,విద్యారంగ నిపుణుల సూచనలు తీసుకుంది.

ప్రక్షాళన దిశగా..

కొత్తగా నిర్ణయించిన మెనూను సంక్రాంతి తర్వాత అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పెరుగుతున్న విద్యార్థులకు మంచి పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను అందించడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండడంతోపాటు ఉత్సాహంగా చదువుకునేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెప్తున్నారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ పథకం అమలుపై ప్రత్యేక దృష్టిసారించి దశలవారీ ప్రక్షాళన చేస్తున్నారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

▸ మూడోరోజు 268మంది హాజరు

కాకినాడ క్రైం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మూడో రోజైన గురువారం 268మంది హాజరు కాగా 185మంది తదుపరి పరీక్షకు అర్హత సాధించారు. ఈ ప్రక్రియను కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ స్వయంగా పర్యవేక్షించారు.



పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు



లాంగ్ జంప్ చేస్తున్న యువకుడు

రైలునుంచి జారి పడి వ్యక్తి మృతి

తునిరూరల్,జనవరి 2(ఆంధ్రజ్యోతి): తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో కదులుతున్న రైలునుంచి జారి పడి వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం తుని గుల్లిపాడు రైల్వేస్టేషన్ మధ్య పాయకరావుపేట ఇందిరాకాలనీ సమీపాన రైలుపట్టాలపై రైలునుంచి జారి పడి 21ఏళ్ల వయసు గల యువకుడు మృతి చెందాడని, మృతుడి ఆచూకీ వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించామని తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీస్‌స్టేషన్ నెంబరు 9490619020ను సంప్రదించాలని కోరారు.

అర్ధరాత్రి డివైడర్‌ను ఢీకొని.. ఇద్దరు యువకుల మృతి

జగ్గంపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో మురారి గ్రామ శివారున బుధవారం అర్ధరాత్రి బైక్ డివైడర్‌ను ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. ఇద్దరూ వరుసకు అన్నదమ్ములు అయ్యేవారు. తూర్పుగోదావరి జిల్లా మోరంపూడికి చెందిన లింగం నవీన్(21), సంతోష్(20) అన్నదమ్ముల బిడ్డలు. దీంతో వీరిద్దరూ కూడా అన్నదమ్ములవుతారు. వీరు కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరంలో తన స్నేహితుడిని బుధవారం అర్ధరాత్రి ఇంటివద్ద దింపారు. తిరిగి ఇంటికి వస్తుండగా గండేపల్లి మండలం మురారి గ్రామ శివారునకు వచ్చేసరికి బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. నవీన్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానిక ఎస్ఐ నాగబాబు సంఘటన స్థలానికి చేరుకుని సంతోష్‌ను రాజమహేంద్రవరం తరలించారు. ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. నవీన్ మృతదేహాన్ని పెద్దాపురం పోస్టుమార్టానికి తరలించారు.



నవీన్, సంతోష్ (ఫైల్)

సంఘటనాస్థలంలో లింగం నవీన్, సంతోష్

▸ ఇద్దరూ వరుసకు అన్నదమ్ములు

▸ గండేపల్లి మండలం మురారిలో ఘటన

మోరంపూడిలో విషాదం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం మురారి వద్ద డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో అన్నదమ్ములు లింగం నవీన్, లింగం సంతోష్ కుమార్‌ల మృతిచెందడంలో వీరి స్వస్థలం మోరంపూడిలో విషాదం అలుముకుంది. వీరిలో నవీన్ సూరంపాలెం ఆదిత్యలో బీటెక్ చదువుతున్నాడు. సంతోష్ తాపీ పని చేసుకుంటున్నాడు. నవీన్ తండ్రి గతంలో కరెంట్ షాక్‌తో మరణించడంతో అతడ్ని తల్లి వరలక్ష్మి కొడుకును ఇంజనీరింగ్ చదివిస్తోంది. కుమారుడి మృతితో ఆమె విలపిస్తోంది. లింగం సంతోష్ తండ్రి రత్నంరాజు కూడా తాపీపని చేస్తుంటాడు. పిల్లల మృతితో రెండు కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి.

సముద్రంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

▸ మూడుకు చేరిన మృతుల సంఖ్య

▸ కన్నీరుమున్నీరుగా విలపించిన నానమ్మ

సర్పవరం జంక్షన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట సముద్రంలో గల్లంతైన బొర్ర శ్రీనుబాబు(17) మృతదేహం గురువారం ఎన్టీఆర్ ఓల్డ్ బీచ్‌లో లభ్యమైంది. నూతన సంవత్సరం వేళ కొత్తపల్లి మండలం కోనపాపపేట శివారు మల్లివారితోటకు చెందిన గుత్తుర్తి సతీష్‌కుమార్(17), కాకినాడ రామకృష్ణారావుపేట ఎర్రరోడ్డుకు చెందిన వడిసెల గౌరీలక్ష్మీనాగసాయి(16) సముద్రంలో బుధవారం వేర్వేరుగా గల్లంతై మృతిచెందిన విషయం తెలిసిందే. వడిసెల గౌరీలక్ష్మీనాగసాయితో కలసి సముద్రస్నానానికి వెళ్లి బొర్ర శ్రీనుబాబు గల్లంతయ్యాడు. అతడి కోసం పోలీసులు మత్స్యకారులతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం సూర్యారావుపేట సాగరతీరానికి శ్రీనుబాబు మృతదేహం కొట్టుకువచ్చినట్లు మత్స్యకారులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు మృతదేహాన్ని పరిశీలించి శ్రీనుబాబుగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆశలు ఆవిరి

కుమారుడు అనారోగ్యంతో మృతి చెందడం, తర్వాత కోడలు ఇంటి నుంచి వెళ్లిపోవడంతో మనవడు బాగోగులు, సంరక్షణ బాధ్యత నానమ్మ బొర్ర దుర్గపై పడింది. వయసు మీద పడినా ఇళ్లల్లో పాచిపనులు చేస్తూ ఉన్నంతలో చదివిస్తోంది. కొత్త సంవత్సరంలో సరదాగా స్నేహితులతో బీచ్‌కు వెళ్లి వస్తానంటూ చెప్పి ఇంటి నుంచి వెళ్లిన మనవడు ఇలా అర్థంతరంగా సముద్రంలో గల్లంతు కావడం, తర్వాత విగతజీవిగా మారడాన్ని చూసిన నానమ్మ దుర్గ కన్నీరుమున్నీరుగా విలపించింది. నానీ నానీ అంటూ ఎప్పుడు వెన్నంటి ఉంటే మనవడికోసం రోధించడం చూపరులకు బాధ కలిగించింది.



బీచ్‌లో మృతదేహం.. ఇన్‌సెట్‌లో శ్రీను(ఫైల్)

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

జగ్గంపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గండేపల్లి హైవేపై గురువారం రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. రాజమండ్రివైపు నుంచి దేవరపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు మోటారుసైకిల్‌పై జగ్గంపేట వైపు వస్తున్నారు. వెనుకనుంచి వస్తున్న మోటారు సైకిల్ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని పోలీసులు ఆసుపత్రికి తరలించారు.

పోర్టు ఎల్‌డీసీగా సుబ్రహ్మణ్యం

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టులో లేబర్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా ఎన్.సుబ్రహ్మణ్యాన్ని ప్రభుత్వం నియమించింది.ఆయన విజయనగరం లేబర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై కాకినాడపోర్టుకు వస్తున్నారు.

నేడు దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

కాకినాడలో జిల్లాస్థాయి పోటీలు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సైన్స్ అధికారి, డీఈవో

కాకినాడ రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాలిపేటలోని పీఎస్‌రాజు మున్సిపల్ కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాల్లో దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన-2025కు సంబంధించిన జిల్లాస్థాయి పోటీలను కాకినాడ డీఈవో పిల్లి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ తెలిపారు. బెంగళూరులోని విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నలాజికల్ మ్యూజియం వారి సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. భౌతిక, రసాయన శాస్త్రాలు, గణితం, భూమి అంతరిక్షశాస్త్రం, జీవ, పర్యావరణ, జీవరసాయన, కంప్యూటర్ శాస్త్రాలు వంటి ఉప అంశాల్లోను ఉపాధ్యాయుల, విద్యార్థుల వ్యక్తిగత ప్రదర్శన, విద్యార్థుల గ్రూప్ ప్రదర్శన వంటి విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. జిల్లాలోని ప్రతి మండలంనుంచి వ్యక్తిగత విభాగంలో 42, గ్రూప్ విభాగంనుంచి 42, ఉపాధ్యాయుల విభాగం నుంచి 42 మొత్తం 126 ప్రాజెక్టులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యాయన్నారు. వివరాలకు 9912788333 నెంబర్లో సంప్రదించాలన్నారు.

తాళ్లపొలంలో స్కూటీ దగ్ధం

తనపై కొందరు దాడి చేశారంటూ ఏరియా ఆస్పత్రిలో చేరిన వ్యక్తి

కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలంలో ఘటన

ద్రాక్షారామ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం తాళ్లపొలంలో గురువారం స్కూటీ దగ్ధమైంది. మండలంలోని తాడిపల్లి గ్రామానికి చెందిన పండు రమేష్ తనపై కొంతమంది దాడిచేశారని చెప్పి స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేరాడు. తాళ్లపొలంలోని ఒక పొలంలో విత్తనాలు జల్లుతుండగా కొంత మంది తనపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించారని, తాను తప్పించుకున్నానని, దీంతో తన స్కూటర్‌పై పెట్రోల్ పోసి తగులపెట్టారని అన్నాడు. పోలీసులు పండు రమేష్ నుంచి వాంగ్మూలం తీసుకున్నట్లు సమాచారం. కానీ, ఇంకా దీనిపై కేసు నమోదు చేయలేదు.



దగ్ధమవుతున్న స్కూటీ

స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జోన్-2 పరిధిలో(ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో) ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సు పోస్టులను ఒక ఏడాది కాలపరిమితితో కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ పద్మాశశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కల్గిన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 17 వరకూ సాయంత్రం ఐదు గంటల్లోగా రాజమహేంద్రవరంలోని వైద్య,ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకుల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు సీఎఫ్‌డబ్ల్యు.ఏపీ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. గతంలో నోటిఫికేషన్ నెం.5/2022, 1-12-2022న కానీ, 1/2023, 20-09-2023 తేదీన కానీ ఇది వరకే నియమితులై పనిచేస్తున్న అభ్యర్థులు దరఖాస్తు చేయడానికి అనర్హులని, వారి దరఖాస్తులు తిరస్కరిస్తామని అన్నారు.

రత్నగిరిపై డిజిటల్ చెల్లింపుల రెండో కౌంటర్ ప్రారంభం

అన్నవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులు, వ్రతం టిక్కెట్లు, దర్శనం, ఇతర సేవల కోసం చేపట్టే నగదు చెల్లింపులతోపాటు డిజిటల్ పేమెంట్ల చెల్లింపునకు గురువారం పశ్చిమ రాజగోపురం వద్ద మరో కౌంటర్‌ను ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ప్రారంభించారు. సాధారణరోజుల్లో మధ్యాహ్నం 2గంటల వరకు పర్వదినాల్లో సాయంత్రం వరకు ఈ కౌంటర్ అందుబాటులో ఉండనుంది.



డిజిటల్ చెల్లింపుతో కొన్న టికెట్‌ను అందజేస్తున్న ఈవో, చైర్మన్

ప్రమాదవశాత్తూ కాలువలో జారిపడి వ్యక్తి మృతి

ఆత్రేయపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ కాలువలో జారిపడి వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ రాము తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన మేడిద శ్రీను(40) జీవనోపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లి వచ్చాడు. అతడి భార్య రోజా సింగపూర్‌లో ఉంటుంది. శ్రీనుకు ఇద్దరు సంతానం. వీళ్ల పిల్లలు ఆత్రేయపురం మండలం వద్దిపర్రులో వదిన వెంకటలక్ష్మి ఇంటి వద్ద ఉంటున్నారు. డిసెంబరు 31న శ్రీను పిల్లలను చూడడానికి వద్దిపర్రు వచ్చాడు. ఈ నెల 2న తెల్లవారుజామున 3గంటల సమయంలో పంటకాలువలో ప్రమావశాత్తూ జారి పడి మృతిచెందాడు. మృతుడి తమ్ముడు వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు మత్స్యకారులకు నష్టపరిహారం పంపిణీ

కలెక్టరేట్(కాకినాడ), జనవరి2(ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు మండలం కోరంగిలో ఓఎన్‌జీసీ సంస్థ విడుదల చేస్తున్న నష్టపరిహారాన్ని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు శుక్రవారం మత్స్యకారులకు అందజేయనున్నారు. తాళ్లరేవు మండలంలో మొత్తం 7050 మంది లబ్ధిదారులకు రూ.44కోట్ల 59లక్షలు పరిహారం పంపిణీ చేయనున్నారు. ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.63,250 చొప్పున అందజేస్తారు. ఈ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి కోరంగిలో ప్రారంభమవుతుంది. మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం ఉదయం 11గంటలకు కోరంగి చేరుకుంటారు. మధ్యాహ్నం తాళ్లరేవులో మధ్యాహ్న భోజనం స్వీకరిస్తారు. అక్కడినుంచి మధ్యాహ్నం 3గంటలకు సామర్లకోట చేరుకుని రాష్ట్ర గిడ్డంగి గోదాములను ప్రారంభిస్తారు. రాత్రి 8గంటలకు మంత్రి విజయవాడ చేరుకుంటారు.

గొల్లప్రోలులో డంపింగ్‌యార్డు కాంపౌండ్ వాల్ నిర్మాణంపై వివాదం



డంపింగ్‌యార్డు స్థలం వద్దకు వచ్చిన అధికారులను చుట్టుముట్టిన స్థానికులు

▸ నిర్మాణాలు తొలగించిన స్థానికులు

గొల్లప్రోలు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): చెత్తను వేసే డంపింగ్‌యార్డును తరలించమంటే కాంపౌండ్‌వాల్ నిర్మించడంపై గొల్లప్రోలులో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు అడ్డుకోవడంతోపాటు ఇప్పటికే నిర్మించిన కాంపౌండ్‌వాల్‌ను తొలగించారు. గొల్లప్రోలు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం, పీహెచ్‌సీ చెంతనే డంపింగ్‌యార్డు ఉంది. గొల్లప్రోలు పరిధిలోని చెత్తాచెదారాన్ని తెచ్చి ఇక్కడే వేస్తుండడంతో పరిసరాలు దుర్గంధపూరితంగా మారాయి. దీంతో ఈ మార్గంలో వెళ్లలేకపోతున్నామని కొంతకాలంగా ఎస్సీ కాలనీ, అరుంధతీయపేటవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్‌యార్డును ఇక్కడినుంచి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు డంపింగ్‌యార్డు వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని ఒకపక్కగా తరలించడంతో కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ సీఎస్ఆర్ నిధులనుంచి రూ.7లక్షలు మంజూరు చేశారు. దీంతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీనిపై ఎస్సీ కాలనీ, అరుంధతీయపేటవాసులనుంచి అభ్యంతరం వ్యక్తమైంది. కాంపౌండ్‌వాల్ నిర్మించి చెత్త ఇక్కడే వేస్తే తాము పరిసర ప్రాంతాల్లో ఉండలేమని, పనులు నిలిపివేయాలని వారు అధికారులు, ప్రజాప్రతినిధుల ను కోరారు. తమ డిమాండ్‌కు స్పందన లేకపోవడంతో వారు ఆగ్రహించి ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి కాంపౌండ్‌వాల్ వద్దకు గురువారం సాయంత్రం చేరుకుని పనులు అడ్డుకున్నారు. కాంపౌండ్‌వాల్‌ను, అందుకు ఉపయోగించిన ఇతర కట్టడాలను, ఫెన్సింగ్‌ను తొలగించారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న పోలీసులు వారిని సముదాయించేందుకు ప్రయత్నించినా శాంతించలేదు. పోలీసులు అక్కడ ఉండగానే మరోవైపు నిర్మాణాలు తొలగించారు. కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, ట్రైనీ కలెక్టర్ భావన, తహసీల్దార్ సత్యనారాయణ, ఎం పీడీవో స్వప్న, ఇన్‌చార్జి కమిషనరు ప్రభాకర్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ అక్కడకు చేరుకున్నారు. వారిని ఆందోళనకారులు చుట్టుముట్టారు. వారితో అధికారులు చర్చలు నిర్వహించారు. డంపింగ్ యార్డు పరిసరాలు 2.60 ఎకరాలు ఉందని, ఇందులో 1.50 ఎకరాలను ఎస్సీకాలనీ, అరుంధతీయపేట శ్మశానవాటికలకు కేటాయిస్తామని ఆర్డీవో తెలిపారు. ఆరునెలల్లోగా డంపింగ్ యార్డు స్థల సేకరణ పూర్తి చేసి అక్కడకు తరలిస్తామని చెప్పా రు. వీటిపై తమ నిర్ణయాన్ని తెలియజేయాలని ఆర్డీవో వారికి సూచించగా శుక్రవారం బదులి స్తామని నాయకులు తెలిపారు.

అధిక ధర ఇస్తానని మోసాలు

కొవ్వూరుకు చెందిన వ్యక్తి అరెస్టు

చాగల్లు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అధిక ధర ఇస్తామని నమ్మించి ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా మోసగించిన కొవ్వూరుకు చెందిన దుద్దుపూడి సూరిబాబును పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్ఐ కె.నరేంద్ర వివరాల ప్రకారం.. తూర్పుగోదావరిజిల్లా చాగల్లు మండలంలోని దారవరం గ్రామానికి చెందిన గారపాటి సత్తిబాబు నుంచి సూరిబాబు నాలుగు లారీ లోడుల ధాన్యాన్ని తీసుకువెళ్లి డబ్బులు ఇవ్వకుండా మోసగించి పరారీలో ఉన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సూరిబాబును గురువారం అరెస్టు చేసి నిడదవోలు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు తెలిపారు. అతడిపై కొవ్వూరురూరల్, టౌన్ స్టేషన్లు, సీతానగరం, గోకవరం, జంగారెడ్డిగూడెం, ఐ.పోలవరం, ఒడిశా పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైనట్లు ఎస్ఐ తెలిపారు.

ఆస్తి తగాదాల నేపథ్యంలో పినతండ్రిపై కత్తితో దాడి

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో ఘటన

కొవ్వూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదాల నేపథ్యంలో పినతండ్రిపై కత్తితో దాడిచేసిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం నందమూరు గ్రామంలో చోటుచేసుకుంది. కొవ్వూరు మండలం నందమూరు గ్రామానికి చెందిన గన్నమని లక్ష్మణరావుకు, అతడి అన్నయ్య వెంకట రామారావుకు కొంతకాలంగా భూతగాదాలు ఉన్నాయి. గన్నమణి వెంకటరామారావు, అతడి కుమారుడు సతీష్‌చౌదరి లక్ష్మణరావు నడిచే స్థలాన్ని మూసివేశారు. వ్యవసాయ మోటారు పైపులు, వైర్లను కట్‌చేశారు. దీనిపై లక్ష్మణరావు ప్రశ్నించడంతో భూమి సరిహద్దు విషయమై వివాదానికి దిగారు. లక్ష్మణరావు గురువారం పంట పొలం దున్నుతుండగా సతీష్‌చౌదరి అక్కడికి వెళ్లి తండ్రి వెంకటరామారావు సహకారంతో కొడవలితో దాడిచేశాడు. అడ్డువచ్చిన లక్ష్మణరావు భార్య కృష్ణవేణి చెయ్యిపై దాడిచేయడంతో తీవ్ర రక్తగాయాలయ్యాయి. వారిని రాజమహేంద్రవరంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. లక్ష్మణరావు ఫిర్యాదుపై తండ్రి, కొడుకులపై కేసునమోదు చేశారు.

అమలాపురం

మురుగునీటి బోదె ఆక్రమణ

● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రైతులు


మురుగునీటి బోదెను ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం అనాతవరంలో ఎదురుమూడి వుంత, 216 జాతీయ రహదారి మధ్య ఉన్న వరి పొలాల్లోని ముంపునీరు దిగేందుకు గతంలో ఏర్పాటుచేసిన మురుగునీటి బోదెను ఓ రైతు ఆక్రమించుకుని ప్రహరీగోడ నిర్మిస్తున్నాడని ఆ గ్రామానికి చెందిన కొంతమంది రైతులు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ముమ్మిడివరం తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మికి ఫిర్యాదు చేశారు. 150 ఎకరాల్లో మురుగునీరు దిగేందుకు సుమారు వందేళ్ల నుంచి రహదారి ప్రక్కన ఉన్న మురుగునీటి బోదె ఉందని అయితే గతంలో జాతీయ రహదారి విస్తరణలో కొంతమేర బోదెను హైవే అధికారులు తీసుకుని డ్రైనేజీ నిర్మించారని ఆ తరువాత ఓ రైతు కొంతమేర ఆక్రమించి షాపులు నిర్మించి అద్దెకు ఇచ్చారని, తాజాగా కొబ్బరితోటకు చెందిన ఓ రైతు మురుగునీటి బోదెను పూర్తిగా ఆక్రమించి ప్రహరీగోడ నిర్మిస్తున్నాడని దీనివల్ల 150 ఎకరాల్లో మురుగునీరు బయటికి వెళ్లే మార్గం మూసుకుపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆ గ్రామానికి చెందిన రైతులు వాసంశెట్టి పట్టాభిరామయ్య, పెయ్యల పరశురాముడు, నూకల నాగశ్రీహరి, కొప్పిశెట్టి రామకృష్ణలతో పాటు పలువురు జిల్లా కలెక్టర్‌కు, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

రైల్వేలైన్ కోసం సేకరించిన భూములను
రైల్వేశాఖకు అప్పగించాలి

● కలెక్టర్ మహేష్‌కుమార్


రెవెన్యూ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ అలైన్‌మెంట్ ప్రతిపాదనల ప్రకారం సేకరించిన భూములను స్వాధీనం చేసుకుని వెంటనే రైల్వేశాఖకు అప్పగించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రైల్వేలైన్ భూసేకరణ అంశంపై రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. భూ సేకరణకు సంబంధించి అవార్డులు పాసు, నష్టపరిహారాల చెల్లింపు తదితర అంశాలపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను అధిగమించే ప్రయత్నంతో పాటు త్వరితగతిన భూసేకరణ చర్యలు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా భూసేకరణ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఇన్‌చార్జి డీఆర్వో కె.మాధవి, ఆర్డీవోలు డి.అఖిల, పి.శ్రీకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, అయినవిల్లి తహశీల్దార్ నాగలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

'చేపల వేటకు అనుమతి కల్పించాలి'


కలెక్టరేట్ వద్ద చిన్నబోట్ల ప్రతినిధులతో మాట్లాడుతున్న పోలీసులు

అమలాపురం టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేటకు వెళ్లి అంతర్వేది ఫిషింగ్ హార్బర్‌కు వస్తుంటే వలకట్టు రైతులు అడ్డుకుంటున్నారని ఇరగాల రొయ్యల బోట్లు (చిన్నబోట్లు) నడుపుకునేవారు ఆవేదన వ్యక్తం చేస్తూ గురువారం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అంతర్వేదిలో హార్బర్ ఏర్పడిన తర్వాత చేపల వేటకు తమకు ఎంతో అనుకూలంగా ఉందని, అయితే వలకట్టు రైతులు, స్థానికులు అడ్డుకోవడం వల్ల కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారిందంటూ కలెక్టర్ కార్యాలయంలో అర్జీ అందించారు. వేటకు వెళ్లేటప్పుడు ఎటువంటి ఆంక్షలు విధించకుండా అంతర్వేదిలో ఆగేందుకు అనుమతి కల్పించాలని రాకాతి లాజరు, సూరాడ రాజు, రాకాతి యాకోబు, దూడా రాము తదితరులు అర్జీ అందించారు. చిన్నబోట్ల యజమానులతో తొలుత పోలీసులు చర్చలు జరిపారు.

టీడీపీ నాయకుడు సత్యనారాయణ విగ్రహావిష్కరణ


టీడీపీ నాయకుడు సత్యనారాయణ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శిల్పి రాజ్‌కుమార్ వడయార్

ఉప్పలగుప్తం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): చల్లపల్లికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు మాదే సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు చల్లపల్లిలో పిల్లల పార్కు నిర్మించి, సత్యనారాయణ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సత్యనారాయణ విగ్రహాన్ని శిల్పి రాజ్‌కుమార్ గురువారం ఆవిష్కరించారు. పిల్లల పార్కును ప్రారంభించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. టీడీపీ నాయకుడు కొల్లు శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొల్లు అమ్ములుఅబ్బాయి, టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, కూటమి నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, బూసి బుజ్జిదొర, కుటుంబ సభ్యులు మాదే వరలక్ష్మి, రమేష్‌రెడ్డి, వెంకటనారాయణరావు పాల్గొన్నారు.

అభ్యంతరాలకు నోటిఫికేషన్

ముమ్మిడివరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ టౌన్, కంట్రీ ప్లానింగ్ విడుదల చేసిన జీవో ప్రకారం ముమ్మిడివరం నగర పంచాయతీ ఇరుక్కుగా ఉన్న ఏరియా వార్డులకు తయారుచేసిన సర్కిలేషన్ ప్యాట్రన్‌కు సంబంధించి ప్రజల నుంచి సూచనలు, సలహాలు, అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్టు ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలో 17, 18, 19 వార్డులు ఇరుక్కుగా ఉన్నందున ఆయా వార్డుల్లో 12 అడుగులకు తగ్గకుండా ఉన్న వాటికి ప్లానింగ్ అప్రూవల్ ఇవ్వడానికి ఈ జీవో ప్రకారం వీలు పడుతుందన్నారు. దీనిపై సలహాలు, సూచనలు అభ్యంతరాలు ఉంటే ఇ-మెయిల్ ద్వారాగానీ, కార్యాలయానికి వచ్చిగానీ నేరుగా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. జీవోకు సంబంధించిన ప్రతులను ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయ నోటీసుబోర్డులో ఉంచారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

అంబాజీపేట, జనవరి2(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు విద్యా విజ్ఞానిక ప్రదర్శనలను దోహదపడతాయని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. పుల్లేటికుర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యావైజ్ఞానిక ప్రదర్శన మండలస్థాయిలో నిర్వహించారు. ఈ ప్రదర్శనలలో మండలంలోని 9 ప్రభుత్వ, 6 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభతో తయారుచేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో ప్రభుత్వ పాఠశాల నుంచి వ్యక్తి ప్రదర్శనలో సీహెచ్‌జెఎస్ దుర్గ, అన్నపూర్ణ, ఐ.నాగచందు, గ్రూప్ యాక్టివిటీలో గంగలకుర్రు, ఇసుకపూడి, అంబాజీపేట టీచర్ ప్రాజెక్టులో కేజీ నరసింహరావు, రమణ, బి.ఉమాదేవి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, తహశీల్దారు జె.వెంకటేశ్వరి, ఎస్ఎంసీ చైర్మన్ ఎన్.రత్నమాల, ఎంపీటీసీ వడలి కృష్ణమూర్తి, పబ్బినీడి రాంబాబు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేడుకలకు తరలిరావాలి

ముమ్మిడివరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 4వ తేదీన రాజమహేంద్రవరం వేమగిరి వద్ద నిర్వహించే గేమ్ చేంజర్ మూవీ ప్రీ రిలీజ్ వేడుకలకు ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి మెగా అభిమానులు, జనసేన పార్టీ కార్యకర్తలు తరలిరావాలని జనసేన పార్టీ సీనియర్ నాయకుడు గోదశి పుండరీష్ పిలుపునిచ్చారు. ముమ్మిడివరంలో గురువారం జరిగిన జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో కర్రా దుర్గాప్రసాద్, మాదాల శ్రీధర్, ర్యాలి వంశీ, వక్కపట్ల గణేష్, దాట్ల బాబు పాల్గొన్నారు.

రామస్వామితోటలో రాత్రి బడి

కాట్రేనికోన, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రామస్వామితోటలో గల్ఫ్ కార్మికుల సహాయంతో సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు ట్యూషన్ సెంటర్ ఏర్పాటుచేశారు. టీచర్‌గా ఒక నిరుద్యోగ మహిళను నియమించారు. పుస్తకాలు, పెన్నులు నిర్వాహకులు విద్యార్థులకు అందించారు. ప్రతిరోజు విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండి స్కూల్లో చెప్పిన పాఠాలు చదువుకునేందుకు ఈ సెంటర్ ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు చెప్పారు. నల్లా నరసింహమూర్తి, జగడం బాలయోగి, నల్లా హరికిశోర్, అయితాబత్తుల శ్రీను, ఊరం సూర్యారావు, పాము పార్వతి, టీచర్ మోరంపూడి సీత పాల్గొన్నారు.

5న వేంకటేశ్వరస్వామికి లక్షతులసి పూజ

అంబాజీపేట, జనవరి2(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 5న లక్షతులసీ పూజా కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక ఆలయంలో పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. వేలాదిమందికి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగపల్లి నరసింహచార్యులు, అభివృద్ధి కమిటీ చైర్మన్ మేడిద శ్రీనివాసరావు, గణపతి వీరరాఘవులు, కొర్లపాటి గోపి, మేడిద చిన్న, కొర్లపాటి కోటబాబు నైనాల ప్రభాకర్, రవణం రాము పాల్గొన్నారు. జక్కంశెట్టివారిపాలెంలో ఉన్న శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోలక్షతులసి పూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అంబాజీపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్ల మరమ్మతు పనులలో ముక్కామల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు.


యాజమాన్య కమిటీ చైర్మన్‌ల శిక్షణలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష సీఎంవో సుబ్రహ్మణ్యం


ముక్తేశ్వరం జడ్పీ హైస్కూలులో జరిగిన శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈవో

పాఠశాలల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యం

● సమగ్రశిక్ష సీఎంవో సుబ్రహ్మణ్యం

అమలాపురంటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని సమగ్రశిక్ష సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. పాఠశాలల అభివృద్ధిలో భాగంగా చేయి చేయి కలుపుదాం.. బడిని అభివృద్ధి చేద్దాం అనే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. అమలాపురం మండల పాఠశాల యాజమాన్య కమిటీ ఉపాధ్యాయులకు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్లకు పేరూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కోఆర్డినేటర్‌గా ఎంఈవో సరెళ్ల దుర్గాదేవి వ్యవహరించారు. పాఠశాల యాజమాన్య కమిటీల విధులు, బాధ్యతల గురించి వివరిస్తూ బాలల హక్కులను ఏవిధంగా పరిరక్షించాలో తెలియచేశారు. పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు ఎంత ముఖ్యమో సామాజిక తనిఖీ కూడా అంతే ప్రధానమన్నారు. శిక్షణలో ఏపీవో ఎంఏకే భీమారావు, హెచ్ఎం శ్రీనివాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

యాజమాన్య కమిటీలకు శిక్షణ

అయినవిల్లి: పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలు ప్రముఖపాత్ర వహించి దోహదపడాలని మండల విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం గురువారం ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. మండలంలోని 55 ప్రాథమిక, ఐదు ప్రాథమికోన్నత, 11 ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్లకు మండల స్థాయిలో జరిగిన ఈ శిక్షణను ఎంఈవో వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి శ్రీనివాస్‌లు ప్రారంభించి మాట్లాడారు. ఎన్‌రోల్‌మెంట్ పెంచి పాఠశాలలను అభివృద్ధి పథకంలో నడిపించడానికి ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని వారు అన్నారు. రిసోర్స్‌పర్సన్ జి.సాయిశ్రీనివాస్, ఎ.కొండలరావు, సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లకు శిక్షణ

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాల ఎస్ ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు, హెచ్‌ఎంలకు స్థానిక ఎంఆర్సీలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలల అభివృద్ధిలో చైర్మన్లు, హెచ్‌ఎంలు, సభ్యులు భాగస్వాములు కావాలని ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌లు సూచించారు. పాఠశాలల అభివృద్ధి, ఆయా పాఠశాలల పరిధిలో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎ.సాయిరామ్, సుధాకర్‌బాబు, అరుణజ్యోతి, త్రిమూర్తులు, అమ్మాజీలు శిక్షణను అందించారు.

ఎస్ఎంసీ కమిటీలకు శిక్షణా కార్యక్రమం

ఉప్పలగుప్తం: పాఠశాలల యాజమాన్య కమిటీలకు భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 82 పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంఈవో సత్తి సత్యకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్పీలు బీఎల్వీ రాజు, ఎస్ఎస్ఎన్ మూర్తి, ఎం.సతీష్ శిక్షణ ఇచ్చారు.

రాజోలు: పొన్నమండ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఒకరోజు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించామని రాజోలు ఎంఈవో ఎన్.మనోహరం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారని తెలిపారు. ఈ శిక్షణ జిల్లాస్థాయిలో శిక్షణ పొందిన రిసోర్స్‌పర్సన్ల ఆధ్వర్యంలో జరిగిందన్నారు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులకు పాఠశాల నిర్వహణపైనా, విధులు, బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

ముమ్మిడివరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): డిఎంఅండ్ హెచ్‌వో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎల్.శ్రీధర్‌ను సస్పెండ్ చేస్తూ వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ పద్మజశశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ముమ్మిడివరంలోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయానికి ఈ ఉత్తర్వులు అందాయి. డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎల్.శ్రీధర్ మరికొంతమంది ఉద్యోగులు వైద్యులు, వైద్య సిబ్బంది నుంచి లీవులు మంజూరు మెటర్నటీ లీవ్‌లు, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ వంటి పనులకు సంబంధించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు వైద్యశాఖ వాట్సాప్ గ్రూప్‌లో హల్‌చల్ చేయడంతో ప్రభుత్వం స్పందించి జిల్లా ఇమినేజేషన్ అధికారి బి.వీవీ.సత్యనారాయణను విచారణ అధికారిగా నియమించారు. దీనిపై జిల్లా 25మంది వైద్యాధికారులు, వైద్యులు 22మంది వైద్య సిబ్బందిని గతనెల ముమ్మిడివరం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో విచారించి వారినుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించిన విషయం విదితమే. ఆ నివేదికను విచారణాధికారి సత్యనారాయణ ఉన్నతాధికారులకు నివేదించడంతో సీనియర్ అసిస్టెంట్ ఎల్.శ్రీధర్‌ను సస్పెండ్ చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఆర్డీ పద్మజ శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎంఅండ్‌హెచ్‌వో ఎం.దుర్గారావుదొర తెలిపారు.

'కూటమి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి'


బోడసకుర్రు సచివాలయ శిలాఫలక ఆవిష్కరణలో ఎమ్మెల్యే ఆనందరావు

అల్లవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల నేతృత్వంలో కూటమి పాలనలోనే అభివృద్ధి సాధ్యమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. రూ.43.60 లక్షలతో నిర్మించిన బోడసకుర్రు గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. రూ.10లక్షల కోట్ల అప్పుతో గత సీఎం జగన్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని, చంద్రబాబు కూటమి పాలనలో సూపర్-6 పథకాలు, ఉచిత బస్సు అమలు చేస్తామన్నారు. బోడసకుర్రులో హెల్త్ సబ్ సెంటర్ నిర్మించి డ్రైనేజీ సమస్యలు తీరుస్తామన్నారు. బోడసకుర్రులో శ్మశాన వాటిక స్థలాలు ఏర్పాటు చేయాలని కొందరు ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. టీడీపీ రాష్ట్ర నేత మెట్ల రమణబాబు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, అల్లాడ స్వామినాయుడు, పీఆర్ డీఈఈ టీఎస్ రాజ్‌కుమార్, ఏఈలు ఎస్.ఫకీర్, జి.స్వామి, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, అడపా శ్రీనివాసరావు, దొమ్మేటి శ్రీశాంతిభవానీ, దాట్ల గోపీరాజు, చింతా శ్రీనివాస్, దత్తుడు. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అమలాపురం తహశీల్దార్‌గా అశోక్‌ప్రసాద్


బాధ్యతలు స్వీకరించిన అశోక్‌ప్రసాద్‌ను అభినందిస్తున్న దివాకర్

అమలాపురం రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అమలాపురం తహశీల్దార్‌గా పలివెల అశోక్‌ప్రసాద్ గురువారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన జీడీ కిశోర్‌బాబు ఇటీవల పదవీ విరమణ చేశారు. ఇప్పటి వరకు డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న అశోక్‌ప్రసాద్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించి తహశీల్దార్‌గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అశోక్‌ప్రసాద్‌ను రెవెన్యూ జేఏసీ చైర్మన్, ఉప్పలగుప్తం తహశీల్దార్ వాసా ఎస్.దివాకర్, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు సాధనాల యెల్లేశ్వరరావు, కొప్పిశెట్టి వెంకటగణేష్, గణపతి అభినందనలు తెలిపారు.

ప్రజా ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

● పత్రికను అందజేసిన మల్లాడి


కాకినాడ కలెక్టర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 6 నుంచి 8వరకు మూడు రోజులపాటు ఎంతో ఘనంగా జరుగనున్న యానాం ప్రజా ఉత్సవాలు, ఫలపుష్ప ప్రదర్శనలకు రావాలని కోరుతూ పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కాకినాడ కలెక్టర్ షన్‌మోహన్‌కు ఆహ్వానపత్రికను అందజేశారు. కాకినాడకు వెళ్లిన మల్లాడి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా ఇరువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుని పుష్పగుచ్ఛాలని అందించుకున్నారు. అనంతరం ఆహ్వానపత్రికను అందజేశారు. ఈనేపథ్యంలో యానాంకు సంబంధించిన పందులంక సొసైటీ వివాదం, యానాంకు ఐదు ఏకరాల భూమి కేటాయించాల్సిన అంశాలపై చర్చించారు.



పరిపాలనాధికారిని సత్కరిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

యానాం పరిపాలనాధికారి కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల ప్రభుత్వం ఐదురోజులపాటు సంతాప దినాలు ప్రకటించడంతో బుధవారం కార్యాలయంలో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించలేదు. ఈనేపథ్యంలో గురువారం వివిధ శాఖల అధికారులు పరిపాలనాధికారి మునిస్వామిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరిపాలనాధికారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

మల్లాడిని కలిసిన పలువురు అధికారులు

నూతన సంవత్సర నేపథ్యంలో పలువురు అధికారులు గురువారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును కలిశారు. యానాం పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, సహకారశాఖ అధికారి అబ్దుల్ రజాక్, ముమ్మిడి శంకర్, జిప్మెర్ మెడికల్ ఆఫీసర్ ఆనందరాజ్, యానాం డీఏటీ డిప్యూటీ డైరెక్టర్ ఉషారాణి, ప్రజాపనులశాఖ ఈఈ, ఏఈ మల్లాడిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

21న తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారాలు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురంటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21న విజయవాడలో నిర్వహించనున్న తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారాల బ్రోచర్‌ను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గురువారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిరంతర సాహితీ సేవలో శ్రీశ్రీకళావేదిక ముందంజలో ఉందని, అందుకు కృషి చేస్తున్న కత్తిమండ ప్రతాప్‌ను అభినందించారు. శ్రీశ్రీకళావేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, జాతీయ కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు తిరుమలరావు మృతి


పాయసం తిరుమలరావు(ఫైల్)

ముమ్మిడివరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ క్రాపచింతలపూడికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు, కాంట్రాక్టరు పాయసం తిరుమలరావు (బుజ్జి) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. వ్యక్తిగత పనుల నిమిత్తం విశాఖపట్నం వెళుతుండగా మార్గమధ్యలో గుండెపోటుకు గురై మృతి చెందారు. తిరుమలరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తిరుమలరావు ఆకస్మిక మృతిపట్ల పలువురు దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి సంతాపం తెలిపారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



సాధించిన అవార్డులతో మహిళాక్లబ్ అధ్యక్షురాలు పద్మావతి

అమలాపురం టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏలూరులో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో అమలాపురం వాకర్స్ క్లబ్ ఉత్తమ అవార్డులను సాధించింది. బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డును క్లబ్ అధ్యక్షురాలు ఎస్ఎస్.పద్మావతి, బెస్ట్ క్లబ్ అవార్డుతో పాటు వాకర్స్ క్లబ్ బెస్ట్ అధ్యక్షునిగా బోనం సత్యవరప్రసాద్‌ల అవార్డులను అందుకున్నారు. అమలాపురం శ్రీకళా గ్రాండ్‌లో సన్మానం గురువారం నిర్వహించారు. అవార్డు గ్రహీతలను సత్కరించారు. జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, ఏరియా ఉపాధ్యక్షుడు గోకరకొండ నాగేంద్ర, మహిళా క్లబ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పేరి లలిత, కార్యదర్శి వై.అనంతలక్ష్మి, వై.రామతులసి, పి.సత్యకుమారి, పి.రాజేశ్వరి పాల్గొన్నారు.

కిటకిటలాడిన వాడపల్లి వెంకన్న ఆలయం

ఆత్రేయపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి):వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునే స్వామివారికి గోదావరి జలాలను తీర్థపు బిందెతో తీసుకువచ్చి స్నపనమూర్తులకు అభిషేకం చేశారు. ఒకరోజు ఆదాయం రూ.3,72,942వచ్చినట్టు ఉపకమిషనర్, ఈవో సూర్యచక్రధరరావు తెలిపారు.

9న కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో మెగా జాబ్‌మేళా

అమలాపురం టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ అమర్‌రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌లో పనిచేసేందుకు అప్రెంటీస్ పూర్తిచేసిన ఐటీఐ అభ్యర్థులకు ఈ నెల 9వ తేదీన కాకినాడ ప్రభుత్వ ఐటీఐ వద్ద మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఐటీఐ కళాశాల కన్వీనర్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆపరేటర్ గ్రేడ్-5లో భాగంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు నెలకు రూ.21 వేలు వేతనంతో పాటు ఇతర సదుపాయాలు, ఆహార వసతి సదుపాయాలు కల్పిస్తారన్నారు. ఐటీఐ పాసైన విద్యార్థులకు అప్రెంటీస్ ట్రైనింగ్‌లో నియమించేందుకు అప్రెంటీస్ మేళా కూడా నిర్వహిస్తారన్నారు. 9వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా జాబ్‌మేళా జరుగుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో వివిధ ట్రేడ్‌లలో శిక్షణ పూర్తి చేసుకుని ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. వివరాలకు సెల్ 8639230775ను సంప్రదించాలన్నారు.

చెరువుల వద్ద మోటార్లు చోరీ

అల్లవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తూర్పులంకలో చిట్నీడి వెంకటరత్నంకు చెందిన రొయ్యల చెరువుల వద్ద సోమవారం రాత్రి మూడు విద్యుత్ మోటార్లను దొంగతనం చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తూర్పులంక గ్రామంలో చెరువుల వద్ద ఇటీవల పలు దొంగతనాలు జరిగాయి. రొయ్యల చెరువుల వద్ద మోటార్ల దొంగతనాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని బోడసకుర్రు, గోడిలంక, మొగళ్లమూరి, తూర్పులంక తదితర గ్రామాల్లో సుమారు 60కు పైగా మోటార్లు చెరువుల వద్ద చోరీకి గురయ్యాయి. దొంగలు రెచ్చిపోయి మోటార్లు ఎత్తుకుపోతుండడంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు.

దొంగతనాల నివారణకు సీసీ కెమెరాల ఏర్పాటు


సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్

అల్లవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అల్లవరంలో ఇటీవల దొంగతనాలు జరిగిన నేపథ్యంలో వాటి నివారణకు పోలీసు పర్యవేక్షణలో ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ చెప్పారు. అల్లవరం ప్రధాన కూడలిలో గురువారం రాత్రి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. వ్యాపారులు కూడా తమ దుకాణాలవద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. దొంగతనాల నివారణకు పోలీసుశాఖ పటిష్టవంతమైన నిఘా కొనసాగిస్తుందని సీఐ వివరించారు. కంకిపాటి వీరబాబు, బండి గుప్తాపు మల్లేష్, ఈటి మోహనరావు, చిట్నీడి శ్రీనివాస్, ఆచంట రవి, వి.రామసుబ్రహ్మణ్యం, కాకిలేటి సాయి, మేడిద సుబ్బారావు, గమిడి సూరిబాబుతో పాటు పలువురు వ్యాపారులు, స్థానికులు పాల్గొన్నారు.


ఉపాధి కూలీల వేతనం రూ.300 ఇవ్వాలి

అల్లవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల దినసరి వేతనం రూ.300 ఇచ్చేలా ఫీల్డు అసిస్టెంట్‌లు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ ఆదేశించారు. అల్లవరం మండల పరిషత్ వద్ద ఉపాధి ఫీల్డు అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఉపాధిహామీ పనులు చేసే జాబ్‌కార్డు హోల్డర్ల పనులు పెంచాలన్నారు. మస్తర్ల వెరిఫికేషన్, కూలీల హాజరులో తేడాలు ఉంటే ఫీల్డు అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీవో వి.శ్రీనుబాబు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 81 దరఖాస్తులు

రాజోలు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పాలగుమ్మి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద డిప్యూటీ తహశీల్దార్ సీహెచ్ఎస్ రాజు అధ్యక్షతన గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో డీఎల్పీవో పి.బొజ్జిరాజు పాల్గొన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 1, రేషన్ కార్డుల కోసం 23, గృహనిర్మాణాలు 8, పెన్షనర్లు 42, ఇళ్లస్థలాలు 5, ఇతర శాఖలకు సంబంధించి 2, మొత్తం 81 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీఆర్వోలు, వీఆర్ఏలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన


వివేకానంద విద్యార్థినులను అభినందిస్తున్నఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): 1ఎం1బి జాతీయ యువమార్పు తయారీదారుల రాష్ట్రపతి సదస్సుకు ఎంపికైన విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాల విద్యార్థినులు పి.భువనసాధిక, ఎస్.రోజ్‌లిన్‌లను గురువారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అభినందించారు. ఆయన క్యాంపు కార్యాలయంలో విద్యార్థులు ఎమ్మెల్యేను కలిశారు. రాష్ట్రపతి నుంచి ప్రశంసలు పొందడం అందరికీ గర్వకారణమన్నారు. కార్యక్రమంలో లింగోలు పెదకాపు తదితరులు పాల్గొని వారిని అభినందించారు.



స్వామివారిని దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు

కిటకిటలాడిన వాడపల్లి వెంకన్న ఆలయం

ఆత్రేయపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునే స్వామివారికి గోదావరి జలాలను తీర్థపు బిందెతో తీసుకువచ్చి స్నపనమూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం తిరుప్పావై వేద పారాయణం జరిపారు. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ. 3,72,942 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఘనంగా స్వామివార్ల మాస కల్యాణం

ఆత్రేయపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో గురువారం స్వామివారి మాస కల్యాణాన్ని వైభవంగా జరిపారు. విశ్వక్సేనపూజ, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపి స్వామివారి కల్యాణాన్ని రమణీయంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో రమణమూర్తి వాటి ఏర్పాట్లు నిర్వహించారు. ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి మాసకల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరపగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో కొలువై ఉన్న ర్యాలి జగన్మోహిని కేశవస్వామివారు



కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నీటి సంఘం అధ్యక్షులు, ఇరిగేషన్ అధికారులు

రబీలో ప్రతీ ఎకరాకు నీరందించండి

కె.గంగవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రబీ పంటలో కోటిపల్లి ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో ప్రతి ఎకరాకు సాగునీరందించాలని కోటిపల్లి డీసీ అధ్యక్షుడు దాట్ల విజయగోపాల్‌రాజు అన్నారు. గురువారం కోటిపల్లి ఇరిగేషన్ కార్యాలయంలో డీసీ పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులు, ఇరిగేషన్ అధికారులతో సమావేశం జరిపారు. నీటి సంఘాల ఎన్నికల జరిగిన తరువాత తొలిసారి నీటి సంఘం అధ్యక్షులు, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనికి అధ్యక్షుడిగా రామచంద్రపురం డివిజన్ ఇరిగేషన్ ఈఈ, కోటిపల్లి డీఈ వీవీ రామకృష్ణ అధ్యక్షత వహించారు. డీసీ పరిధిలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో డీసీ అధ్యక్షుడు విజయ గోపాల్‌రాజు మాట్లాడుతూ నీటి సంఘాల అధ్యక్షులు, అధికారులు సమన్వయంతో పని చేసి రైతులకు సాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని కోరారు.

బ్యాంక్ కెనాల్‌ను రక్షించాలి: కోటిపల్లి డీసీ పరిధిలో బ్యాంక్ కెనాల్‌ను ఇరిగేషన్ అధికారులు రక్షించాలని కోట నీటి సంఘం అధ్యక్షుడు ములకల విశ్వేశ్వరరావు సభలో కోరారు. డీసీ ఉపాధ్యక్షుడు గంగవరం నీటి సంఘం అధ్యక్షుడు తాడాల లోవరాజు, దంగేరు, పల్లిపాలెం నీటి సంఘాల అధ్యక్షులు గోపి సతీష్, రాయుడు వెంకట రమణలు తమ సంఘాల పరిధిలో చేపట్టాల్సిన పనులు వివరించారు. సమావేశంలో డీసీ పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులను ఇరిగేషన్ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో డ్రైనేజీ డీఈ రెడ్డి పోచారావు, ఇరిగేషన్ ఏఈలు, గుమస్తాలు, లష్కర్‌లు పాల్గొన్నారు.

అధిక దిగుబడిపై రైతులకు అవగాహన

కె.గంగవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం, దంగేరు గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. మండల వ్యవసాయశాఖ అధికారి బలుసు రవి మాట్లాడుతూ అధిక దిగుబడి సాధించేందుకు రైతులు చేయాల్సిన పనులపై వివరించారు. ఇప్పటికే తాము గ్రామాల్లో ఎక్కువ, తక్కువ దిగుబడి సాధించిన రైతుల వివరాలు సేకరించామన్నారు. మండలంలో ఇప్పటి వరకు 70 శాతం పొలాల్లో నాట్లు వేశారని, మిగిలిన 30 శాతం మరో వారం రోజుల్లో పూర్తవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఏవో, రైతులు



ర్యాలికి చెందిన చింతా శ్యామ్‌కుమార్ కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

సత్యసాయి సేవా పురస్కారం అందజేత

ఆత్రేయపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ర్యాలి గ్రామానికి చెందిన శ్యామ్‌జాదుగర్ మ్యాజిక్ ఫ్యామిలీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ ఉబలంక సత్యసాయి సమితి ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా సత్యసాయి శత జయంతి సేవా పురస్కారంతో సత్కరించారు. గురువారం సత్యసాయి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొండబాబు ఆధ్వర్యంలో పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో కాశిన ప్రభాకరరావు, సత్యసాయి సేవా సంఘం కన్వీనర్ వర్ధనరావు, సభ్యులు శ్యామ్ కుటుంబ సభ్యులను సత్కరించారు.

కపిలేశ్వరపురంలో ఉచిత వైద్య శిబిరం

కపిలేశ్వరపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పీవీఆర్ నారాయణరెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచ్ సాకా శ్రీనివాస్ ప్రారంభించారు. హాస్పిటల్ వైద్యాధికారులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ నిఖిల్ వివిధ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కె.శివ చక్రవర్తి, సచివాలయం సిబ్బంది, ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆలమూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి న్యాయ సలహాలు, సూచనలు అందించడానికి తమ సంస్థ కృషి చేస్తుందని హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా అధ్యక్షురాలు అమ్మిరెడ్డి రజని తెలిపారు. ఆలమూరు మండలం చొప్పెల్లలో గురువారం విభిన్న ప్రతిభావంతుల పరిరక్షణ సమితి అధ్వర్యంలో దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు మామిడిశెట్టి వెంకట రమణారావు, కార్యదర్శి వై.లక్ష్మినరసింహాచార్యులు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

పూర్తయిన దమ్ములు..వరినాట్లు ముమ్మరం

ఆత్రేయపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సబ్ డివిజన్ పరిధిలోని దాళ్వా వరి సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. నాలుగు మండలాల్లో 28,445 ఎకరాల్లో రైతులు దాళ్వా సాగు చేసేందుకు సన్నద్ధమయ్యారు. రైతులు, కౌలు రైతులు సుమారు 15వేల మంది వరిసాగు చేస్తున్నారు. ఆత్రేయపురం మండలంలో 4,615 ఎకరాలు, ఆలమూరు మండలంలో 9,615, రావులపాలెం మండలంలో 6,675, కొత్తపేట మండలంలో 7,500 ఎకరాల్లో వరినాట్లు వేసేందుకు ఆకుమడులు సిద్ధం చేసుకున్నారు. సబ్ డివిజన్‌లోని నాలుగు మండలాల్లో 20 శాతం పైబడి వరి నాట్లు పూర్తయ్యాయి. జనవరి మొదటివారంలో నాట్లు పూర్తిగా వేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆలమూరు మండలంలో 80 శాతం విత్తనాలను నేరుగా వెదజల్లే పద్ధతిని రైతులు ఎంచుకున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచలన మేరకు రైతులు వరినాట్లు పూర్తి చేస్తే మార్చిలో వరికోతలు వస్తాయన్నారు. దాళ్వా సాగుకు సంబంధించి రైతులకు సూచనలు అందిస్తున్నట్టు తెలిపారు.





వాడపల్లి వద్ద దమ్ము చేస్తున్న ట్రాక్టర్. పక్క చిత్రంలో అంకంపాలెం వద్ద ఆకుమడులు

విద్యార్థి దశలోనే సైన్సుపై పట్టుసాధించాలి

• కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు • ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్సు ఫెయిర్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి) విద్యార్థి దశలోనే సైన్సుపై విద్యార్థులు పట్టు సాధించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం మండలస్థాయిలో నిర్వహించిన సైన్సు ఫెయిర్ ను ఆయన ప్రారంభించారు. 12 ప్రభుత్వ పాఠశాలలు, 8 ప్రైవేట్ పాఠశాలలను సైన్సు ఫెయిర్‌లో 61 ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థుల ప్రాజెక్టులను ఎమ్మెల్యే పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మి, విశ్వ మారుతిప్రసాద్, మిద్దే ఆదినారాయణ, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయవరం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపకరిస్తాయని మండల విద్యాశాఖ అధికారులు ప్రత్తి రామలక్ష్మణమూర్తి, వైసూర్య నారాయణ అన్నారు. గురువారం రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల నిర్వహించారు. హెచ్‌ఎం వి.శాంతి సునిత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మండల సైన్స్ కోఆర్డినేటర్ ఎస్. బుల్లి భాస్కర రామారావు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. వ్యక్తిగత విభాగంలో వెంటూరు హైస్కూల్‌కు చెందిన వి.దిలీప్, ఎస్. సాయికుమార్, పసలపూడి హైస్కూల్, గ్రూప్ విభాగంలో జి.రాజు అశోక్ తేజ, పి.భాను ప్రసాద్, రాయవరం హైస్కూల్, పి.సుశ్రుత్ రెడ్డి, ఓఎస్ఆర్ వరప్రసాద్, మాచవరం హైస్కూల్, టీచర్ విభాగంలో డి.జోసఫ్ కుమార్ పసలపూడి విజేతలుగా నిలిచారు. విజేతలకు బహుమతులను అంద జేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకట రమణ, టీడీపీ సీనియర్ నేత ఉండవిల్లి రాంబాబు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మెన్ డి.కోటేశ్వరరావు, సైన్స్ ఉపాధ్యాయుడు ఎస్‌ఏ రెహమాన్, గొలుగూరి వీరాంజనేయరెడ్డి సీహెచ్‌ఈసీ ప్రియదర్శిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కె.గంగవరం: కె.గంగవరం ఉన్నత పాశాలల లో గురువారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు జరిపారు. దీన్ని ఎంపీపీ పంపన నాగమణి ప్రారంభించారు. ఈ ప్రదర్శ నలో పది ఉన్నత, 3 ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శిం చారు. వ్యక్తిగత విభాగంలో పామర్రు ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన యాంటీ స్వీప్ అలారం, ద్వితీయ స్థానంలో దంగేరు ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన జేసీబీ, గ్రూపు విభాగంలో గంగవరం విద్యార్థులు చేసిన సులువుగా బరువులు మోసే సాధనం, ద్వితీయస్థానంలో సుందరపల్లి విద్యార్థుల చేసిన నీటిని శుద్ధిచేసే యంత్రం, టీచర్ విభాగంలో సత్యవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన బహుళసాధక పరిశుభ్రత వాహనం బహుమతులు సాధిం చారు. విజేతలకు బహుమతులు అందించారు. మొదటి రెండు బహుమతులు తయారు చేసిన ప్రాజెక్టులు జిల్లాస్థాయికి ఎంపికవుతాయని భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పి.బ్రహ్మానందం తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ, విద్యా కమిటీ చైర్మన్ పెంటపాటి శ్రీమన్నారాయణ, వైస్ చైర్మన్ కాదా వెంకట రమణ, కూటమి నాయకులు చిర్రా రాజ్‌కుమార్, నేమాని సత్తిబాబు, అల్లూరి దొరబాబు, ఎంఈవో ఏ. నాగరాజు, ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు, ప్రదానోపాధ్యాయుడు పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు చిట్టూరి రామ్మోహన్, నరాల కృష్ణకుమార్, మేడిశెట్టి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కె.గంగవరంలో బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీపీ తదితరులు

మండపేట: మనిషి జీవితం సైన్స్‌తో ముడిపడి ఉందని మండల విద్యాశాఖ అధికారులు ఎన్.రామచంద్రరావు, సోమిరెడ్డి అన్నారు. తాపేశ్వరం పీఎస్ఆర్‌బి జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మండలస్థాయిలో జరిగిన పోటీలకు 29 పాఠశాలల విద్యార్థులు వివిధ ప్రదర్శనలను ప్రదర్శించారు. ఫార్మింగ్ విలేజ్ సోలార్ సిస్టం, రోబో వంటి పలు ప్రదర్శనలు ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందించారు. తాపేశ్వరంలో జరిగిన సైన్స్ ఫెయిర్ పోటీల్లో ఉపాధ్యాయులు, పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


ఆలమూరు: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వైజ్ఞానిక ప్రదర్శనలతో వెలికితీయవచ్చునని జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా అన్నారు. జడ్పీ గరల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను సర్పంచ్ నాతి లావణ్యకుమార్‌రాజా, ఎంపీడీవో ఎ.రాజు ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి దాదాపు 50కి పైగా వైజ్ఞానిక ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు భమిడిపాటి అప్పాజీ, సుబ్బరాజు, పాఠశాల హెచ్‌ఎం పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు.

ఆత్రేయపురం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని ఎంపీడీవో వెంకట రామన్ అన్నారు. గురువారం మహాత్మాగాంధీ హైస్కూల్‌లో విద్య వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థుల ప్రదర్శనను పరిశీలించి వారి నైపుణ్యాన్ని అభినందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, హైస్కూల్ సెక్రటరీ కరస్పాండెంట్ పీఎస్ రాజు, ఎంఈవోలు వరప్రసాదరావు, సాహెబ్‌లు ఈ ప్రదర్శనలు తిలకించి విద్యార్థులను ప్రశంసించారు. ఎంపికైన ప్రాజెక్టులు జిల్లాస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆలమూరు వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో డీఈవో సలీంబాషా

రావులపాలెం: రావులపాలెం బాలుర, బాలికల పాఠశాలలో గురువారం నిర్వహించిన విద్య వైజ్ఞానిక ప్రదర్శనలలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, తహశీల్దారు ముక్తేశ్వరరావు, ఎంపీడీవో ఉమామమహేశ్వరరావు, పాఠశాల చైర్మన్లు నందం వీరవెంకట సత్యనారాయణ, కోట సోమేష్ ఈ ప్రదర్శనను పరిశీలించారు. ఎంఈవోలు విద్యార్థుల ప్రదర్శనలు వారికి చూపించారు. ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన పాఠశాలలకు ఎస్‌ఐ చంటితో కలిసి వారు బహుమతులను అందించారు.



అమరావతిలో మోడరన్ మ్యాగజైన్ ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

మోడరన్ విద్యా సంస్థల మ్యాగజైన్ ఆవిష్కరించిన సీఎం

ద్రాక్షారామ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మోడరన్ విద్యా సంస్థలకు సంబంధించిన 2025 వార్షిక మ్యాగజైన్ ప్రతిని బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. సంస్థ అకడమిక్ డైరెక్టర్స్ ఏ.కృష్ణ, ఏ.రమాదేవి మంగళగిరిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి అందజేశారని విద్యా సంస్థల అధినేత జీవీ రావు తెలిపారు. గ్రామీణ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న మోడరన్ విద్యా సంస్థల కృషిని సీఎం అభినందించినట్లు వారు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేద్దాం

మండపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు, విద్యా కమిటీల పాత్ర కీలకమని మండల విద్యాధికారులు నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డి అన్నారు. మండపేట మండలం తాపేశ్వరం, పీఎస్ఆర్‌బీ జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు మెరుగైన విద్య, వసతుల కల్పన, ఉత్తమ ఫలితాల సాధన నూరుశాతం విద్యార్థుల ఉత్తీర్ణత మధ్యాహ్న భోజనం అమలుపై కూడా దృష్టిసారించాలని వారు కోరారు. కార్యక్రమంలో మండలంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యా కమిటీల సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

కొత్తపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు పూలమాలలు, బొకేలు వద్దని, పుస్తకాలు, పెన్నులతో రావాలని సూచించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనకు అభినందనలు తెలిపిన అభిమానులు పుస్తకాలు, పెన్నులు తీసుకువచ్చారు. వీటిని మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని అవి తెచ్చిన వారికి సంతృప్తి కలుగుతుందన్నారు. పెన్నులు, పుస్తకాలు తెచ్చిన వారికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ త్సామా బాబు, బండారు బుల్లితాత, సింగిరెడ్డి గోవిందు, చీకట్ల అబ్బు, కోలా రాంబాబు, కడియం చిన్న తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

గర్భిణులకు సామూహిక సీమంతాలు

రాయవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వెదురుపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం గర్భిణులకు సామూహిక సీమంతాలు, వృద్ధులకు రగ్గులు, పండ్లు పంపిణీ చేశారు. మదర్ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 10 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి పౌష్టికాహారం అందించారు. అరవై మంది వృద్ధులకు రగ్గులు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి.రాంబాబు, ఎస్ఎంసీ చైర్మన్ బి.దుర్గా భవాని, మదర్‌థెరిస్సా సేవా సమితి కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్, ఎ.నాగేంద్ర, ఐ.కావ్య మాధురి, పీఈటీ కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

21న తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారాలు

అమలాపురంటౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విజయవాడలో 21న నిర్వహించనున్న తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారాల బ్రోచర్‌ను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీకళావేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మండపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం విద్యుత్ మరమ్మతులను పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం నేటి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఏడిద బైపాస్ రోడ్డు, మండపేట ఏడిద రోడ్డులో ఉన్న రైస్‌మిల్లులు, రాజీవ్ గృహకల్ప, సంఘం కాలనీ, విజయలక్ష్మీనగర్, మోహర్‌బాబా ఆశ్రమం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈ కె.రత్నాలరావు తెలిపారు.

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం విద్యుత్‌శాఖ ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కపిలేశ్వరపురం, కాలేరు, 11కేవీ ఫీడరు లైన్లపై చెట్టు కొమ్మలను తొలగించడం కారణంగా వాటి పరిధిలోని కపిలేశ్వరపురం, వెదురుమూడి, పడమరఖండ్రిక, నల్లూరు, కాలేరు, సుభద్రాపురం, అచ్యుతాపురం, వడ్లమూరు, నిడసనమెట్ట గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

పీడీఎస్‌యూ పోరాట ఫలితమే మధ్యాహ్న భోజన పథకం

ద్రాక్షారామ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం పోరాటం ఫలితంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నదని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ అన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం అమలుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

కల్కి అవతారంలో వేంకటేశ్వరస్వామి

రాయవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): దశావతార ఉత్సవాలను పురస్కరించుకుని రాయవరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి గురువారం కల్కి అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అంగర బాబు, పెద్దింటి కృష్ణమాచార్యులు అర్చకత్వంలో భక్త సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, అమ్మ వారికి కుంకుమార్చనలు జరిపారు. రాయవరం, వెదురుపాక, వి.సావరం, లొల్ల, మహేంద్రవాడ పరిసర ప్రాంతాల భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఎక్సైజ్ దాడుల్లో ఇద్దరి అరెస్టు

ఆలమూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ఎక్సైజ్ పోలీసులు గురువారం జరిపిన దాడిలో నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. బడుగువానిలంక గ్రామానికి చెందిన జాన లక్ష్మి, మారిశెట్టి ఏసురత్నం నాటుసారా విక్రయిస్తుండగా దాడి చేసినట్టు తెలిపారు. వారి నుంచి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు తెలిపారు. ఆలమూరు కోర్టులో వీరిని హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారన్నారు. ఈ దాడిలో ఎస్‌ఐ రాంబాబుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో మహిళా పోలీసుల పాత్ర కీలకం

ఆలమూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాబోయే పండుగలను పురస్కరించుకుని గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడటంలో మహిళా పోలీసులు కీలకంగా ఉండాలని ఆలమూరు ఎస్‌ఐ ఎం. అశోక్‌కుమార్ సూచించారు. ఇటీవల ఎస్పీ నుంచి రివార్డు స్వీకరించిన సందర్భంగా గురువారం ఆయన్ను మహిళా పోలీసులు అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ అశోక్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో మండలంలోని 24 సచివాలయాల మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్య జిల్లా కార్యవర్గంలో పలువురికి చోటు

కొత్తపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని శ్రీకాకోళపు శివరామసుబ్రహ్మణ్యం, కంచెర్ల బాబి, వైశ్య నాయకుడు కనకరాజు, కోరుప్రోలు వెంకటేశ్వరరావు సమక్షంలో ఏర్పాటు చేశారు. ఇందులో కొత్తపేటకు చెందిన వైశ్య నాయకులకు చోటు కల్పించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడిగా కొత్తపేటకు చెందిన శ్రీకాకోళపు లక్ష్మినారాయణ(బాబి), మెడికల్ కమిటీ జిల్లా చైర్మన్‌గా డాక్టర్ పి.కృష్ణారావు, పొలిటికల్ కమిటీ వైస్‌చైర్మన్ తమ్మన సాయిప్రసాద్‌లను నియమించారు. తమకు సముచిత స్థానం కల్పించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. వైశ్య ప్రముఖులు పలువురు వీరిని అభినందించారు.